# కాలోస్త్రీ

శ్రావణం వచ్చేసినా సెగలు కక్కే గ్రీష్మం వెళ్ళిపోలేదు రోజూ వచ్చే మెయిలే లేటవుతుంటే సంవత్సరానికొక సారి వచ్చే ఋతువు ఓ పది రోజులు ఆలస్యమయితేనేం అన్నట్టు ఇన్‌డెఫినెట్‌లీ లేట్ అని బోర్డు కెక్కిపోయింది వర్ష ఋతువు

కాస్త వేడి తగ్గిన సాయంకాలం!

రైల్వే ఆస్తిలానులో ఆఫీసర్‌గారూ, ఆయన సాహచర్యంతో మరో ఆరు నెలలు వయసు గడించిన ఆయన శ్రీమతీ కూర్చున్నారు దూరంగా గేటు దగ్గర బోగెన్ విల్లీలు మిలమిలా మెరుస్తున్నయ్ సువిశాలమైన కాంపౌండు మధ్య, షాపు నిండా సామాన్లు పేర్చుకుని, ఇంట్లో మనుషుల చుట్టూ ఆస్తులను, బ్యాంకు ఎకౌంట్లను కంచుకోటల్లా రెండు వరసల్లో పహరా పెట్టిన పెద్దవ్యాపారస్థుడిలా ధీమాగా, ఓ రెండంతస్థుల మేడ లాను మధ్య బాట కిరుపక్కలా పార్కుల్లో కని పించే అందమైన మొక్కలు, పూలతో సహా

"ఎలా వుంది వెన్నెలా, ఎడబాటు?" చేతితో తుంపిన గడ్డిపరక ముని పంట నొక్కుతూ అడిగాడు లిటరేచర్ చదువు కున్న కౌండిన్య భార్య శశిరేఖను కేవలం ఓ కిరణంగా ఒప్పుకోలేక సొంతం వెన్నె లనే నామకరణం చేసేశాడు మొదటి రాత్రే!

"భలే బోరు కొట్టేసింది బాబోయ్! అమ్మేమో పని ముట్టుకోనిచ్చేది కాదు నాన్నగారు ఇల్లు కదలనిచ్చేవారు కాదు వచ్చిన ప్రతి వుత్తరానికీ జవాబు రాస్తే ఆఫీసు డబ్బంతా పోస్టేజికే ఖర్చు అవు తుందన్న ప్రభుత్వోద్యోగిలా మీరు నా ఉత్తరాలకు జవాబులు రాసేవారు కాదు చూశారా, అన్నీ ఆఫీసర్ బుద్ధులే నాచేత వాగిస్తున్నారు కాని మీరు నోరు మెద పడంలే"

"మెదపకేం! మెదుపుతున్నా నేనెలా ఫీలయ్యానో చెప్పనా?" దగ్గరగా జరగడం మొదలెట్టాడు కౌండిన్య

"అబ్బపోదురూ, మీరూ మీ చేష్ట లూను! నెలరోజుల్లో మొదటి ఉత్తరానికి తప్ప జవాబు రాయని మనుషులు 'ఇంత' 'ఇదయి' పోతున్నారంటే ఎలా నమ్మను?"

మృదువైన హస్తమేదైనా పట్టుకుంటే పగులుతుంది జాగ్రత్త అన్నట్టు ముని వేళ్ళతో ఎర్రని కలువలాంటి ఆమె అర చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఆమె కళ్ళ లోకి చూసి ఏదో చెప్పబోయాడు కౌండిన్య

ఇంటిలోని టెలిఫోన్ మోగింది

"నే చూసివస్తా" అంటూ శశిరేఖ ఇంట్లోకి పరుగెత్తింది.

ఆమె జడ వంకే చూస్తున్న కౌండిన్య ఆమె ఇంట్లోకి వెళ్ళాక బోగెన్‌విల్లీలవైపు చూశాడు గేటు దగ్గర ఎవరో అపరిచితుడు ఆఫీసు పనుల మీద ఇళ్ళవద్ద కలుసుకునే వాళ్ళను చూస్తే కౌండిన్యకు విసుగు వెన్నెల వస్తే బాగుండును

ఇంటివైపే చూస్తున్న కౌండిన్యకు ఆఫీసరుగా చేయడం నటించడం చేత నయినా తన హోదాకు భంగకరమని "నమస్కారం సార్!" అన్న పలకరింపు విని తల పక్కకు తిప్పక గత్యంతరం లేకపోయింది

"ఎవరండీ?"

"బరంపురంలో పని చేస్తున్నాను సార్! మీతో కొంచెం మాటాడాలి"

"హమ్మ వచ్చేశా, మూర్తిగారి భార్య నే వచ్చానని ఎలా తెలిసిపోయిందో అప్పుడే ఫోన్ చేసింది" నిలుచున్న కొత్త మనిషి వేపు చూసింది శశిరేఖ

"ఓహ్, మీరా?"

"నమస్కారం!"

"ఆయన రైల్లో నాతోనే త్రీటయర్లో వచ్చారు రండి, లోపలకు వెళదాం"

కౌండిన్యకు ఏదో చికాకనిపించింది డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళారందరూ

"ఇప్పుడే వస్తా" అంటూ లోపలికి వెళ్ళింది శశిరేఖ

కూచోమని కౌండిన్య అననూలేదు, రమణరావ్ తనంత తనుగా చొరవ చేసుకుని కుర్చీలో కూర్చోనూ లేదు

తెలుగువాడు, ఆఫీసర్ తన మాట విని తనకు సహాయం చేస్తాడనుకున్న రావ్ నిరుత్సాహ పడిపోయాడు, ఆయన "నన్ను ముట్టుకోకు నా మాలకాకి!" స్వభావాన్ని చూసి ఆయన ఇంటి దగ్గర వినడానికి ఇష్టపడకపోతే ఆఫీసు లోనే చెప్పవచ్చు అయినా సాయంకాలం రావడం పొరబాటేమో! రైల్లో కనబడ్డావిడ ఆయన భార్య అని ఎలా ఊహించగలరూ, ఎవరయినా! నుంచునే వున్న రమణరావ్ మనస్సు ఆ క్రిందటి రోజు సాయంకాలంలోకి పోయింది

విజయవాడ ప్లాట్‌ఫారం మీద రావ్‌కు వీడ్కోలివ్వడానికి అతని భార్య కాక, మరదలూ, మామగారూ కూడా వచ్చారు ఆమెను దిగబెట్టినందుకు కృతజ్ఞతా సూచకంగా అక్కడ ఎటాచ్ కాబడే పార్సెల్ త్రీటయర్‌లో తనకు రిజర్వేషన్ దొరికింది

రావ్ మరదలు డీసెల్ ఇంజన్ స్పీడులో మాటాడేస్తోంది

"బావగారూ! బొత్తిగా మమ్మల్ని మరచిపోకండి ఉత్తరాలు రాస్తుండండి" స్టేషనుచేరిన డీసెల్‌గా ఈ వాక్యంతో ఆగింది

"ఏమండీ, ఇంటి కెప్పుడు చేరుతారు?" రావ్ శ్రీమతి అడిగింది

"రేపిదే టైమ్‌కి ఖరదా, ఎల్లుండి పని చూచుకుని బుధవారం నాటికి బరంపురం వొచ్చేస్తా డబ్బు అందగానే డ్రాఫ్టు పంపుతా, ఆ ఆకుల నెక్లెస్ చేయించుకో ఆ తరవాత మళ్ళీ కుదరదు"

పెళ్ళయిన ఏడాదికే రెండుసార్లు బంగారం చేయించిన బావవైపు మరదలూ, అల్లుడివైపు మామగారూ మాత్రమే కాక దూరంగా ఉండి ఇదంతా వింటున్న

ఓ 'ఆమె' కూడా ఉంది మరి కాసేపట్లో మరదలు పిల్లను తీసుకుని వెళ్ళి రావ్ ఓ ఫిల్మ్‌ఫేర్, ఆంధ్రప్రభా కొనుక్కొచ్చాడు వాళ్ళు తిరిగివచ్చేలోగా 'ఆమె' రావు భార్యా స్నేహితురాళ్ళయ్యారు ఆమె ఖురదాయేనని తెలుసుకున్న రావ్ భార్య అతను రాగానే ఆ విషయం చెప్పింది

"అచ్ఛా!" అన్నాడు రావ్

బోగీ ఎటాచ్‌మెంట్ అయింది "మీ బర్త్ నంబర్ చూసుకున్నారా?" అన్నాడు రావ్

"ఎభై ఏడనుకుంటా "

"అప్పర్ అయి ఉంటుంది. సరేలెండి లోపల చూసుకోవచ్చు "

అమ్మాయితో మాటాడుతున్న యువకుణ్ణి అడిగాడు ఆమె తండ్రి

"చూడు బాబూ, మా అమ్మాయికి కాస్త సాయంగా ఉండు ఖురదాలో దిగుతుంది "

"తప్పకుండా," అన్నాడు రావ్

"అమ్మాయికి కాస్త కాఫీ, ఫలహారం భోజనం నీతోపాటు తెప్పించిపెట్టు నాయనా!" మరోమారు చెప్పాడు ఆమె తండ్రి

ఇద్దరి సామాన్లూ లోపల పెట్టారు పోర్టర్లు

"చూశారా, నే చెప్పలే, మీకు అప్పర్, నాకు సైడ్ లోయర్ ఇచ్చారు "

"ఫర్వాలేదు లెండి ఎలాగో ఎడ్‌జస్ట్ అవుదాం!" అంది ఆమె

రావ్ శ్రీమతి లోపలకి వచ్చింది

"బావా మంచినీళ్ళు నింపుకున్నావా?" మరదలుపిల్లా వచ్చింది లోపలకి

"మీకు వాటర్ కావాలా" అడిగాడు రావ్ ఆమెను

"నాన్నగారు తెచ్చేస్తారు "

"ఈ పుణ్యానికే మీనాన్నగారెందుకూ, చెల్లాయి తెస్తుంది లెండి" — చేతిలోని బాటిల్ తీసుకుంది రావ్ శ్రీమతి

మూడు గంటలూ అయిపోయాయ్

"ఉంటానోయ్ రమణరావ్, ఉండమ్మా దిగుదాం" రావ్ మామగారు దిగిపోయారు

"వస్తానమ్మాయ్, జాగ్రత్త ఏం కావలసినా ఈ అబ్బాయినడుగు" దిగిపోయాడు ఆమె తండ్రి

కలకలలాడే ఆమె ముఖం చూసి 'లక్ష్మీదేవిలా ఉంది! ఈమెను చేసుకున్న ధన్యుడెవరో' అనుకున్నాడు రావ్

"చూడండి, మీరు మీదకు వెళ్ళడం ఇబ్బందేమో, నేను మీదకు వెళతాను మీరు కింద పడుకోండి మీ సామాను క్రింద సర్దేస్తా "

సామాన్లు సర్దడం అయిన తర్వాత ఆ పక్క వేసుకుని "థాంక్స్ అండీ!" అంది

ఫిల్మ్‌ఫేర్ పేజీలు తిరగేస్తున్నాడు నుంచునే వున్న రావ్

"అలా ఎంతసేపని నుంచుంటారు, కూచోండి—" ఆమె ఓ పక్కగా కూచున్నాడు

"ఇందండి" అంటూ ఫిల్మ్‌ఫేర్ ఆమెకు అందించి ప్రభ చదవడం మొదలెట్టాడు రావ్

ఏలూరు వచ్చేసింది

"ఇక నే మీదకు వెళతా, గ్లాస్ కిందకు దించేయండి రాజమండ్రి ప్రాంతంలో గొలుసులు కత్తిరించేస్తారని వినికిడి "

రైలుప్రయాణాలూ, అందులోనూ



'ఈ కాలం పిల్లలు'లో ఒక రసవత్తరమైన దృశ్యంలో ప్రభ, రామకృష్ణ. లక్ష్మీదీపక్ దర్శకత్వంలో అనంతలక్ష్మీ ఆర్ట్‌పిక్చర్స్ నిర్మించే చిత్రమిది.

---

ఒంటరిగా చెయ్యడం అలవాటు లేని 'ఆమె'కు నిద్ర రాలేదు. ఫిల్మ్‌ఫేర్ అంతా చదివేసింది అతనినడిగి ప్రభ తీసుకుంటే అనుకుంది తటపటాయిస్తుండగా అతనే మంచినీళ్ళకని కిందకు దిగాడు ఆమె మనసులో ఉన్నది గ్రహించినట్టు ఇది కూడా ఉంచండి అంటూ ప్రభ ఇచ్చేశాడు

"ఖురదా రైట్ టైమ్‌కి చేరుతుందా?" భోజనం చేస్తూ అడిగింది ఆమె

"ఓ యస్ ఓ పది నిముషాలు బిఫోర్ టైమ్ వెడుతుంది మీ వాళ్లెవరైనా స్టేషన్‌కు వస్తారా?"

"ఉత్తరం అంది, ఆయనకు వీలైతే "

ఆమెకు ఒంటరిగా ప్రయాణం చేస్తున్నాననే మెర లేకుండా ప్రయాణం సాంతం జరిగిపోయింది. వేళకు ఉప్మా, కాఫీ, భోజనం అన్నీ తనతోపాటు ఆర్డరిచ్చేసిన రావ్ ఎంత చెబుతున్నా ఆమెను డబ్బు ఇవ్వనియ్యలేదు

రైలు ఆగింది ఆమెను రిక్షా ఎక్కించి తను హోటల్లో బసచేసి నేరుగా ఓ మారు ఆఫీసుకు వెళ్ళాడు ఇంకా అయిదే కదా అయిందని అక్కడ తెలిసింది అధికారి నాలుగింటికే ఇంటికి వెళ్ళిపోయినట్టు అడ్రస్ అడిగి బంగళాకు వచ్చాడు రావ్

'ఆమె' ఆఫీసర్ భార్యని తెలియగానే కొంచెం కంగారనిపించింది

ఇంతలో ఓ చిన్న ట్రేలో కాఫీ కప్పు తీసుకొచ్చింది ఆమె

"తీసుకోండి" టేబిల్ మీద పెట్టింది

రావ్ ఆఫీసర్‌గారివైపు చూశాడు ఆఫీసర్‌గారు భార్యవైపు చూశారు ఆమె రావ్‌వైపు చూసింది

"తీసుకోండీ! అరే మీరింకా నుంచునే ఉన్నారే?"

"కూర్చోండి, తీసుకోండి!" కౌండిన్య ఇంక బాగోదనుకున్నాడేమో'

కాఫీ తాగి తను చెప్పవలసింది ప్రారంభించాడు రావ్ తను సర్వీసులో చేరి సంవత్సరం అయిందనీ, మొదటిసారిగా నాలుగు నెలల తర్వాత తన టి ఏ బిల్స్ మంజూరయ్యాయనీ, గత ఎనిమిది నెలలుగా తన టి ఏ రావడంలెదనీ, ఆఫీసర్‌గా ఆయన సహాయం కావాలనీ చెప్పాడు

"టి ఏ కోసం ఇంత దూరం వచ్చారా? ఎక్కడుంటున్నారు'"

"చిలినో లాడ్జిలో'"

"ఎంత పని చేశారు? మా ఇంట్లో ఉండిపోండి ప్రవాసాంధ్రులం ఈమాత్రం సహకరించుకోపోతే ఎలా?"

"ఎందుకండీ, అద్దె ముందే తీసుకున్నాడు లాడ్జిలో'"

"మీరు రేపు ఆఫీసుకు రండి అసలేం జరిగిందో చూస్తా" అన్నాడు కౌండిన్య

"అలాగే సార్'" లేవబోయాడు రావ్

"బావుంది, మా ఇంట్లో భోజనం చెయ్యకుండా వెళతారా, ఈ రాత్రికి ఇక్కడ భోజనం చెయ్యాల్సిందే "అలాగే ఉండాలని కౌండిన్య అనదలచుకున్నా ఆఫీసర్ అహం అడ్డువచ్చింది కాని శశిరేఖ ఊరుకోలేదు

"ఈయనతో స్టేషన్‌కి వీరి శ్రీమతీ


# శ్రీ బాలాజీ వైద్యశాల




## డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద, ఫోన్ 551, తెనాలి (ఏ పి)
బ్రాంచి 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17

## దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాతుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము. (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వస్థులు, కుష్టు బొల్లి, చర్మవ్యాధులు, హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం-రండి

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండా బాగుచేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను




మరదలూ, మామగారూ వచ్చారు నాన్నారేమో నాకు కాస్త సాయంగా ఉండమని మాట మాత్రం చెప్పినంత మాత్రాన నా చేత పైసా ఖర్చు చెయ్యనివ్వకుండా అన్నీ సమకూర్చారు పీరి భార్య చాలా కలుపుగోలు మనిషి అడుగుదామనుకుంటూనే మరిచిపోయాను ఆమె పేరు?"

"మంజుల"

భార్య వాక్ప్రవాహానికి ఆనకట్ట ఎలా కట్టాలో తెలియలేదు, ఫస్ట్‌ఛాన్స్‌లో ఐ ఆర్ ఎస్ పరీక్ష నెగ్గిన కౌండిన్యకి

"అన్నట్టు మరిచేపోయాను, మీ ప్రభా, ఫిలింఫేరూ నా పక్కబట్టలతో వచ్చేశాయి."

"శశీ, అమ్మ ఏం చేయిస్తోందో చూశావా, గెస్ట్‌ని భోజనానికి పిలిచావ్."

"ఓ యస్, అన్నీ చెప్పే వచ్చాను వంటావిడ వంట ప్రారంభించేసింది కూడా—నే చూసివస్తా, మీరు మాటాడుతూ ఉండండి" వెన్నెల లోపలికెళ్ళిపోయింది

"మిమ్మల్ని ఇంటిదగ్గర డిస్టర్బ్ చేయవలసి వచ్చింది అయాం సారీ సర్!"

"దట్సాల్ రైట్ మీరు ప్రయాణాల్లో ఖర్చుపెట్టే డబ్బుకి మీకు వచ్చే జీతం ఎలా సరిపోతోంది?" కౌండిన్య అడిగాడు తన భార్య ఖర్చు అపరిచితుడు పెట్టడం ఏమాత్రం ఇష్టంలేదనే ఉద్దేశం బయటపడేటట్టు

"అలాగే సార్." నవ్వేశాడు రావ్

"డిలేకి కారణం చూస్తా డోన్ట్‌వరీ."

—ఆఫీసర్ అహాన్ని ఛేదించింది తన అదృష్టమా, లేక ఆయన భార్య తనకు ఋణపడిపోయిందన్న భావమా, తెలుసుకోలేకపోయినా, ఇక తన కార్యం నెరవేరుతుందనే తృప్తితో శెలవుతీసుకున్నాడు సుభావంగా భోజనం చేసి

పదిన్నరకల్లా ఆఫీసుకి చేరిన రావ్ తనకు ముందు కనపడ్డ ఓ గుమాస్తాని పరిచయం చేసుకున్నాడు

"నమొష్కార్, బసొంతు ఐయామ్ పాణిగ్రహీ బిశ్వానాథో పాణిగ్రహీ కో ణాజ్ఞా?"

తను వచ్చినపని వివరించాడు రావ్ ఆ బిల్స్ సీటు తనది కాదనీ, ప్రసాద్ బాబూ ఇంకా రాలేదనీ చెప్పి, "అసంతు, ఆజ్ఞా," అంటూ పాన్ దుకాణానికి తీసు కెళ్ళాడు పాణిగ్రహీ

"దీటాపణ్నో, ఏక్టా, ఏండాయ్ సుబుద్ధీ, ఏక్‌టో సాదా!"

సాదా పాన్ వేసుకున్న రావ్ నోరంతా బంకగా ఉన్నట్టు ఫీలయినా మర్యాదకోసం బయటకు ఏమీ అనలేదు

బిల్స్‌కోసం ఆఫీసర్‌వరకూ వెళ్ళక్కర లేదనీ, ప్రసాద్‌బాబుని కలిస్తే సరిపోతుం దనీ, అతనిదీ బరంపురమేననీ నవ్వు చెప్పాడు ఒరియా ఇంగ్లీషులో పాణి గ్రహీ ఇన్నాళ్ళ కాగితాలు పంపి, వాటి కోసం నిరీక్షించి, రిమైండర్లిచ్చి, ఇంత దూరం వచ్చి గుమాస్తాను కలుసుకోవడ మేవిటని మనసులో అనుకున్నా, ప్రసాద్ రాగానే తనను పరిచయం చేసిన పాణి గ్రహీ మాట కాదనలేక అతని సీటువద్దకు వెళ్ళాడు రావ్ చెప్పవలసింది చెప్పాడు.

"ఓ యస్, మీరు వస్తారనే అబ్జక్షన్ మెమోలు పంపలేదు రిటైర్‌మెంట్ దగ్గర కొచ్చేశాను అమ్మాయి పెళ్ళి స్థిరపడింది మీకు రావలసిన మూడువేల పైచిలుకు లోనూ ఓ ఐదొందలు "

రావ్‌కి మొహం ఎరుపెక్కింది గుమాస్తా లంచాలు తీసుకుంటాడని తెలి యక కాదు ఇంత పబ్లిక్‌గా, డైరెక్ట్‌గా అడిగేసినందుకు

"ఇవ్వకపోతే ?" బిగ్గరగా కేక వేయకపోయినా గట్టిగానే అడిగాడు

దూరంగా వున్న పాణిగ్రహీ వీరిద్దరి వంకా చూశాడు

"మీ దయ, డిపార్టుమెంటుకి కొత్తగా వచ్చారనుకుంటా తెలుగువాళ్ళు కదా అని సూటిగా అడిగేశా " ఇంకా ఏదో అన బోతుంటే "కమిన్ మిస్టర్ రావ్!" అని ఆఫీసర్ కౌండిన్య గదిలోకి నడిచాడు!

ఆఫీసర్ కోటు విప్పేసి కుర్చీకి తగి లించేంతవరకూ మాటాడలేదు రావ్

"సిట్ డౌన్ మిస్టర్ రావ్!" అన్నాడు కౌండిన్య "ఎన్నాళ్ళైంది మీ బిల్స్ పంపి " బెల్ కొట్టాడు

"బీ త్రీ కో బులావ్!"

మరొక్క నిముషంలో తిరిగి వచ్చే శాడు దర్వాన్ "సీట్‌మే నహీ హై సాబ్ అభీ అభీ నీచే గయ్ థే " ఇప్పు డిప్పుడే క్రిందకు వెళ్ళారని చెప్పాడు

ఫైళ్ళు తిరగేస్తున్నాడు కౌండిన్య గోడ గడియారం చూస్తున్న రావ్ మెల్లిగా కుర్చీలో చేరబడ్డాడు కొంతసేపయ్యాక "సార్!" అంటూ ప్రసాద్ వచ్చాడు

"ఈయన ఫైల్ తీసుకురండి "

మరో పావుగంటకి ఫైలుతో సహా వచ్చాడు క్లార్క్

"చూశారా, నాలుగు రిమైండర్లున్నాయి ఇందులో స్కాండలస్, ఏం చేస్తు న్నారు ఇన్నాళ్ళూ?"

"అబ్జక్షన్స్ ఉన్నాయ్ సార్! ఈ ఒక్క పనే నాలుగు రోజులవుతుంది ఎప్పటికప్పుడు చేద్దామనే అనుకుంటు

న్నాను అమ్మాయి పెళ్ళి ఖాయం చేయ డానికి ఈమధ్య శెలవులో ఉన్నాగా, చేస్తా సార్, కొంచెం టైమ్ కావాలి "

"నో, నో, యూ మస్ట్ టూ దిస్ వర్క్, టు డే నౌ మీరు కూడా వెళ్ళండి, అబ్జక్షన్స్ ఆన్సర్ చేసి బిల్స్ సరి దిద్దండి "

ధుమ ధుమలాడుతూ పైలు బల్ల మీద పడేసి 'లంచ్ అవర్' అంటూ కిందకు దిగిపోయాడు ప్రసాద్ ఏం చెయ్యాలో తోచలేదు రావ్‌కి మళ్ళీ ఆఫీసర్ వద్దకు వెళితే బాగుండదేమో క్రిందకెళ్ళి ఓ చాయ్ తాగి మరో సిగరెట్ పెట్టె కొని తెచ్చుకున్నాడు

రెండయ్యాక సీటుకి వచ్చాడు ప్రసాద్ ఏఏ బిల్‌లో ఏ లోపముందో చెప్పి తను క్లెయిమ్ చేసిన పైకంలో పెర్మిసిబుల్ కానిది ఓ ఆరువందలవరకూ ఉంటుందని లెక్క వేశాడు కాలికి వేస్తే మెడకి, మెడకేస్తే కాలికి వేసి రావ్‌ను విసిగించేశాడు

నాలుగై పోయింది ప్రసాద్‌కి లోపల నుండి కబురొచ్చింది

పైళ్ళన్నీ బీరువాలో పెట్టి బీరువాకి తాళం వేసి, దొరగారి గదిలోకి వెళ్ళాడు

"ఆయన పని అయినట్టేనా" కౌండిన్య అడిగాడు

"లేదు సార్ కనీసం రెండు రోజులు పడుతుంది ఇంతకీ ఆయన ఎలానూ వచ్చారు కాబట్టి"

"సరే, వీలయినంత త్వరలో చెయ్యండి"

ప్రసాద్ ఆఫీసర్ గదిలోకి వెళ్ళాక "రావ్ బాబూ, గొప్ప సూచనాసునొంతు" రావ్‌ను పక్కకు తీసుకెళ్ళాడు పాణిగ్రహి

పాణిగ్రహీ, ప్రసాద్ చెబుతున్నది నిజమనీ, అతని కూతురి పెళ్ళి నిజంగానే స్థిరమైందనీ, రెండు నెలల్లో రిటైర్ అవుతాడనీ, ఆ తరువాత ఆ సీటులో వచ్చే క్లార్కు చేతిలో, అబ్జక్షన్లన్ని గోరంతలు కొండంత లౌతాయని, తన మాట వినమని, సగం ఒరియాలోనూ, సగం ఇంగ్లీషులోనూ రావ్‌ని బ్రతిమాలాడు

ఆఫీసర్ గదిలోంచి వచ్చి పైళ్ళు బీరువాలో పెట్టేసే ప్రయత్నంలో ఉన్న ప్రసాద్‌ను పిలిచి ఏదో చెప్పాడు ఒరియాలో పాణిగ్రహీ మాటలు విని కనీసం నూటపదహార్లయినా వెయ్యండి సార్ అన్నాడు ప్రసాద్ "ఓ కే మరి కానీయ్" అన్నాడు రక్కున తెలుగులో పాణిగ్రహీ

బిల్లులన్ని కూడిన మొత్తం కాగితం మీద వేసి 'ఫర్ ఆర్డర్స్' అన్న పైలుకో పెట్టి ఆఫీసర్ గదిలోకి వెళ్ళాడు ప్రసాద్ రెండు రోజులు పడుతుందని తననే బుకాయించిన క్లార్కు అంత వేగంగా ఎలా పనిచేశాడా అని ఆశ్చర్యపోయినా బయటకు ఏమీ అనకుండా సంతకం బరికేశాడు ఆఫీసర్

"చెక్ రాసేస్తా సార్ జస్ట్ వన్ మినిట్ "

కౌండిన్య కోటు తొడుక్కునేలోగా చెక్కు రెడీ అయిపోయింది కౌండిన్య సంతకం పెట్టేసి బయటకు వచ్చి రావ్‌తో "బై మిస్టర్ రావ్ థాంక్స్ ఫర్ ది హెల్ప్" అని చెప్పి వెళ్ళిపోయాడు ★